మకర సంక్రాంతి శుభాకాంక్షలు

సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు

మదనపల్లె సిటీ : ముత్యాల ముగ్గులు, సంప్రదాయాన్ని చాటే గొబ్బెమ్మలతో భోగి సంబరాలు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా జరుపుకున్నారు. మదనపల్లె, రూరల్ మండల పరిధిలో శనివారం భోగి పండుగను కనుల పండువగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే కాలనీల్లో ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. పాత వస్తువులు, కట్టెలు, పిడికలతో మంటలు వేశారు. ఇంటిలోని పెద్దల నుంచి చిన్న పిల్లల వరకు భోగిమంటలు వేసి సందడి చేశారు. ఇళ్ల ముందు రంగు రంగు ముగ్గులు వేశారు. గొబ్బెమ్మలకు పూలు పెట్టి పూజలు చేశారు. ఇళ్లల్లో చిన్నారులకు తలపై రేగిపండ్లు పోసి పూజలు చేశారు.



పీలేరు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భోగి మంట వేసిన దృశ్యం



తంబళ్లపల్లె: ముగ్గులను పరిశీలిస్తున్న డెయిరీ చైర్మన్ శ్రీదేవి



ఆంజనేయస్వామి ఆలయం ముందు భోగిమంటలు

ఊరూ వాడా భోగి మంటలు

పెద్దతిప్పసముద్రం : తెలుగు సంవత్సరాది మూడు రోజుల పాటు జరిగే ముచ్చటైన సంక్రాంతి పండుగను మండలంలోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా శనివారం ఇళ్ళ ఎదుట వేకువ జామునే భోగి మంటలు వేసారు. కష్టాలన్నీ భోగి మంటల్లో బూడిద కావాలని,కొత్త కాంతి ఇంటింటా వెలుగులు నింపాలని కోరుకుంటూ పూజలు నిర్వహించారు. విద్య, వ్యాపారం, ఉద్యోగం నిమిత్తం స్వగ్రామాలను వదలి వెళ్ళిన వారంతా పండుగ కోసం తిరిగి స్వంత గూటికి చేరుకుని కుటుంబ సభ్యులతో పండుగను సంతోషంగా జరుపుకున్నారు.

భోగి మంటలతో సందడి

బి.కొత్తకోట: పల్లెల్లో సంక్రాంతి పండగ కళ ఉట్టిపడుతోంది. శివారం తెల్లవారుజాము వీధుల్లో భోగి మంటలు వేసుకొన్నారు. ఇళ్ల ముంగిట ముగ్గులు, గొబ్బెమ్మలు పెట్టారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. పట్టణాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలు సంక్రాంతి కోసం స్వగ్రామాలకు చేరుకున్నారు. దీనితో పల్లెల్లో సందడి నెలకొంది.

ఘనంగా భోగి

పీలేరురూరల్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా పీలేరు పట్టణంలో భోగి పండుగ ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారిజామునే ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. సమాజంలో చీకటి తొలగిపోయి వెలుగులు నింపాలని కోరుకున్నారు. స్థానిక నెహ్రూ బజార్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ముందు ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి, వాసవిక్లబ్ గ్రేటర్, వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. మహిళలు చేసిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో శ్రీజమిల్క్ డైరీ ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి పండుగలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 25 మంది మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. తమ ప్రతిభపాటవాలతో రంగవల్లులు వేశారు. ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా శ్రీజడెయిరీ చైర్మన్ శ్రీదేవి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పోటీలో పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతిగా 200 ఎంఎల్ నెయ్యి డబ్బాలను పంపిణీ చేశారు.

భోగ భాగ్యాలకు ప్రతీక

కేవీపల్లె : మండలంలోని పలు గ్రామాల్లో భోగ భాగ్యాలకు ప్రతీకగా భోగి మంటలు వేశారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారి జాము నుంచే భోగిమంటలు వేశారు. ప్రతి కుటుంబంలో సమస్యలనే చీకటి తొలగి, సుఖ, సంతోషాలనే వెలుగు నింపాలని కోరుకున్నారు. పలు గ్రామాల్లో గ్రామస్తులంతా ఒక చోట చేరి సామూహిక భోగిమంటలు వేశారు.

ప్రతిఇంటా సం'క్రాంతి'



బి.కొత్తకోట /వాల్మీకిపురం: ప్రతిఇంటా సంక్రాంతి వెలుగులు నిండాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. ప్రజలందరికి వారు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సుఖశాంతులతో పండుగ జరుపుకోవాలని కోరారు. రైతు బాగుంటే పల్లె, దేశం బాగుంటుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే అచ్చమైన తెలుగుపండుగ సంక్రాంతిగా అభివర్ణించారు. మకర సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో అభివృద్ధిరతో కూడిన మార్పు తీసుకురావాలని, ప్రతి ఇంటిలోనూ ఆనందాల సిరులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

- వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఉపకరణాల పంపిణీ
- ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, డీఎస్పీ కేశప్ప



దివ్యాంగుడికి ఉపకరణాలు అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, డీఎస్పీ కేశప్ప తదితరులు

మదనపల్లె : దివ్యాంగులకు అన్ని విధాలా అండగా ఉండేందుకు, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేషకృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ 75 వసంతాల సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ సోషియల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో అడిప్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 65 జిల్లాల్లోని 75 కేంద్రాలలో జరుగుతున్న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీలో మదనపల్లె వెలుగు కేంద్రంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా, డీఎస్పీ కేశప్ప, జిల్లా డిసేబుల్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిశోర్, అలింకో రాజేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగవైకల్యంతో సమాజంలో వివక్షతకు గురవుతున్న దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే ఉద్దేశంతో నిస్వార్థంగా సేవలందిస్తున్న వెలుగు ప్రత్యేక పాఠశాలను ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలోని అందరితో పాటుగా దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో జీవించాలనే లక్ష్యంతో వారి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ఏకకాలంలో జరుగుతున్న ఉపకరణాల పంపిణీలో మదనపల్లెకు ప్రాతినిథ్యం కల్పించడం, కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ రోజున దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ జరగడం సంతోషంగా ఉందన్నారు. వెలుగు సంస్థకు పోలీసుశాఖ తరపున అవసరమైన సహాయసహకారాలు అందిస్తామన్నారు. అలింకో ఉపకరణాల సంస్థ జనరల్ మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 57వేలమంది లబ్ధిదారులకు 65 జిల్లాల్లో 75 కేంద్రాల్లో ఏకకాలంలో రూ.60కోట్ల విలువచేసే ఉపకరణాలను తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్నామన్నారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ ఏడీ ఆర్.వి.కృష్ణకిశోర్‌రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో మదనపల్లె కేంద్రంగా సుమారు 2,000 మంది దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఉదయ్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, రఘునాథరెడ్డి, ఉదయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు తట్టిశ్రీనివాసులురెడ్డి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, బావాజాన్, వైస్ ఎంపీపీ నందినితాజ్, కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, రామిశెట్టిశివయ్య, ఎం.వి.రమణ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజల సౌకర్యార్థం బస్సు సర్వీసు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : గ్రామీణ ప్రాంతాల ప్రజలు వారి గ్రామాలకు చేరుకునేందుకు ఇబ్బందులు లేకుండా బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మద్రిపాడు మీదుగా కలికిరి వరకు బస్సు సర్వీసును స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు వారి గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండడంతో పల్లెవెలుగు బస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు మద్రిపాడు, ఉసిరికాయలపల్లి, నగిరిమడుగు, పాతకోటపల్లి, మేడికూర్తి మీదుగా కలికిరికి వెళ్తుందన్నారు. వాల్మీకిపురం నుంచి ఉదయం 9:15 గంటలకు, సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, రాయుడు, సురేష్ రెడ్డి, సుధాకర, శ్రీనివాసులు శెట్టి, వెంకటేష్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవం



తెట్టు ఆలయంలో గోదాదేవి కల్యాణం

మదనపల్లె సిటీ : స్థానిక బర్మావీధిలోని సాయిబాబా ఆలయంలో శనివారం శ్రీగోదా రంగనాథస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణంలో ప్రత్యేకంగా తయారు చేసి పూలతో కల్యాణ మండం సెట్టింగ్ ఏర్పాటు చేశారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు. తిరుప్పావై ముంగింపు సందర్భంగా ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. కల్యాణమహోత్సవ విశిష్టతను వేదపండితులు నరసింహాచార్యులు భక్తులకు వివరించారు. 18 సంవత్సరాలుగా కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో త్రిదండి చిన్నజీయార్ స్వామి శిష్యులు శాంతారాం, ఆలయ కమిటీ సభ్యులు మార్పూరి నాగార్జునబాబు, బాబునాయుడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట : కురబలకోట మండలం తెట్టు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం శ్రీ గోదా శ్రీకృష్ణ కల్యాణ మహోత్సవం కనుల పండగలా సాగింది. వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భోగి పండగ నాడు ఈ కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. దొంతి లావణ్య, దొంతి కిశోర్, వై. పవన్ కుమార్, వై.ప్రియాంక, వై. ఆర్వీ, కె. శ్రావిక, కె. సాయిరాహుల్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నులక మనోహర్ రెడ్డి దంపతులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మండ్యంవారిపల్లెకు చెందిన భాగ్యమ్మ, తావిలి హరి అన్నసంతర్పణ చేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి తిరునాల

మదనపల్లె సిటీ : స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం తిరునాల వైభవంగా జరిగింది. ఉదయం గణపతి పూజ, హోమాలు చేశారు. స్వామి తిరువాభరణాల పెట్టతో పట్టణంలో ఊరేంగిపు నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలు, పూలతో అలంలకరించారు. మాలాధారులు 18 మెట్లు ఎక్కి ఇరుముడులు చెల్లించారు. అయ్యప్పనామస్మరణలతో ఆలయం పులకించిపోయింది. సాయంత్రం ఆలయ ఆవరణంలో అన్నమయ్య ప్రాజెక్టు ఆద్వర్యంలో కీర్తనలు వినిపించారు.

50 కుటుంబాలకు సంక్రాంతి కానుక కిట్లు

పెద్దతిప్పసముద్రం : కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపురం జిల్లా బాగేపల్లికి చెందిన పరమేశ్వరి ప్రసాద్ బెంగళూరులో స్థిరపడ్డాడు. అక్కడే ఎస్ఎల్ఎస్ ఎలక్ట్రికల్ ప్రైవేటు కంపనీ నిర్వహిస్తున్నాడు. అయితే మండలంలోని కందుకూరు పంచాయతీ అగ్రహారంలో వివాహం చేసుకున్నాడు. వైఎస్సార్‌సీపీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితుడయ్యాడు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా అగ్రహారంలోని 50 మంది దళిత కుటుంబాలకు సంక్రాంతి కానుక కిట్లను శనివారం అందజేసి వైఎస్సార్‌సీపీపై అభిమానం చాటుకున్నాడు.

సంక్రాంతి పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం

పీలేరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక మార్కెట్ యార్డులో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రంగోలి, పతంగుల పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. శనివారం సాయంత్రం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు సదాశివరెడ్డి మాట్లాడుతూ రంగోలి పోటీలో పలువురు మహిళలు పాల్గొనగా టి. విజయ మొదటి బహుమతి రూ. 3000, పూర్ణిమ ద్వితీయ బహుమతి రూ. 2000, సోనూ తృతీయ బహుమతి రూ. 1000, సొంతం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పతంగుల పోటీ విజేతలకు, కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి మహేష్‌గుప్తా, కోశాధికారి ఈశ్వర్ రెడ్డి, సభ్యులు డాక్టర్ ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, అరవింద్ బాబు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తున్న దృశ్యం